క్లుప్తంగా

వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే



చాట్రాయి: మండలంలోని అన్ని గ్రామాల్లో దీర్ఘకాలిక వ్యాధులపై ముమ్మరంగా సర్వే చేస్తున్నారు. పీహెచ్‌సీ సిబ్బంది ఇంటింటికీ తిరిగి కుటుంబ సభ్యుల్లో బీపీ, షుగర్, క్యాన్సర్ లాంటి దీర్ఘకాలిక వ్యాధులను గుర్తిస్తున్నారు. ఏ మందులు వాడుతున్నారు, ఎలాంటి ఆహారం తీసుకుంటున్నారనే అంశాలను నమోదు చేస్తున్నారు.

సినిమాహాలు తనిఖీ చేసిన ఆర్డీఓ



తిరువూరు: ఎ.కొండూరు మండలం చీమలపాడులోని శ్రీలక్ష్మీ టాకీస్‌ను ఆర్డీఓ కె. మాధురి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం నుంచి సరైన లైసెన్స్ పొందకుండా ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు గుర్తించి సినిమా ప్రదర్శనను నిలుపుదల చేశారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

వంట ఏజెన్సీ నిర్వాహకురాలి తొలగింపు దుర్మార్గం

మూలపాడు(ఇబ్రహీంపట్నం): స్థానిక జెడ్పీ పాఠశాలలో 23 ఏళ్లుగా మధ్యాహ్న భోజనం వంట ఏజెన్సీ నిర్వహిస్తున్న రమణమ్మను తొలగించడం దుర్మార్గపు చర్య అని సీఐటీయూ నాయకులు విమర్శించారు. జెడ్పీ పాఠశాల వద్ద రమణమ్మకు మద్దతుగా శుక్రవారం ఆందోళన నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం బిల్లులు సకాలంలో అందని సమయాల్లో అప్పులు చేసి విద్యార్థులకు అమ్మలాగా అన్నంపెట్టి ఆదరించిన వంట ఏజెన్సీ నిర్వాహకురాలు రమణమ్మను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకం యూనియన్ మండల అధ్యక్షురాలు కుంచెం రాజేశ్వరి, ఐద్వా మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.పార్వతి, బేబీ సరోజినీ పాల్గొన్నారు.

పుస్తకాలు, ఆర్థిక సాయం అందజేత



తిరువూరు: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నిర్వహించిన పీజీ సెట్‌లో 36వ ర్యాంకు సాధించిన తిరువూరుకు చెందిన గనే సురేంద్ర ఆర్థిక పరిస్థితి తెలుసుకొని స్థానిక లయన్స్ క్లబ్ నిర్వాహకులు శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు పసుమర్తి వెంకటేశ్వరరావు, వెంకటరమణ దంపతులు విద్యార్థికి ఎంఏ లిటరేచర్, ఇంగ్లిష్ లాంగ్వేజీ పుస్తకాలు, పీజీ డిప్లమో ఇన్ యోగా కోసం ఫీజు చెల్లించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు కంచర్ల ముత్యప్రసాద్, కొమ్మినేని రాజేష్‌ఖన్నా, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

600 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

చాట్రాయి: సారా తయారీ కేంద్రాలపై ఎక్సైజ్ పోలీసులు దాడి చేశారు. నూజివీడు ఎక్సైజ్ ఎస్ఐ మస్తానరావు తెలిపిన వివరాల ప్రకారం.. చీపురుగూడెంలో సారా తయారీ కేంద్రంపై దాడి చేసి ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని నిందితుడు తనగల నాగేశ్వరరావును అదుపులోకి తీసుకున్నారు. చిత్తపూరు గ్రామంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేసి 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. తయారీదారుడు బొల్లికొండ రమేష్‌ను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు.

అయోడిన్ లోపాలపై అవగాహన

మూలపాడు(ఇబ్రహీంపట్నం): అయోడిన్ లోపంతో కలిగే రుగ్మతలపై మూలపాడు జెడ్పీ పాఠశాల విద్యార్థులకు గ్లోబల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ప్రముఖ వైద్యురాలు యామీమ్ మాట్లాడుతూ అయోడిన్ లోపంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. పుట్టబోయే బిడ్డలకు కూడా అవయవ లోపం ఏర్పడుతుందని చెప్పారు. ప్రతి వంద మందిలో ఇద్దరు, ముగ్గురికి గాయిటర్ వ్యాధి వస్తుందన్నారు. అయోడిన్ లోపంపై జిల్లా వ్యాప్తంగా కళాజాత, వీధి నాటకాలతో అవగాహన కల్పిస్తున్నామని ఆ సంస్థ జిల్లా కో–ఆర్డినేటర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. హెచ్ఎం డేవిడ్ రాక్‌ఫెల్లర్, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

కలగానే సెంట్రల్ లైటింగ్



విస్సన్నపేటలో డివైడర్



డివైడర్ పక్కన ఉన్న పశువులు

- డివైడర్ పక్కనే తిష్ట వేస్తున్న పశువులు
- నిత్యం రద్దీగా ఉండే రహదారిలో రాత్రి వేళల్లో ప్రమాదాలు
- చీకట్లో ప్రయాణానికి భయపడుతున్న పట్టణ వాసులు

విస్సన్నపేట: విస్సన్నపేట పట్టణంలో సాయంత్రం ఆరు గంటలు దాటితే ప్రయాణానికి ప్రజలు భయపడుతున్నారు. స్థానిక నూజివీడు రోడ్డు నుంచి ఎ. కొండూరు రోడ్డు (ఎంఎస్‌కే రోడ్డు)లో ఏర్పాటు చేసిన డివైడర్‌లో సెంట్రల్ లైటింగ్ లేకపోవడం, డివైడర్ పక్కనే పశువులు, వీధి కుక్కలు తిష్టవేస్తున్నాయి. వాహన చోదకులకు అవి కనిపించక వాటిని ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారు. దశాబ్దాల కిందట ఏర్పాటు చేసిన డివైడర్‌పై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసి పట్టణాన్ని సుందరీకరిస్తారని ప్రజలు ఎదురు చూస్తున్నారు. డివైడర్‌పై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు గతంలో పలువురు ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చినా అమలుకు నోచుకోలేదు. వివిధ విద్యా సంస్థల విద్యార్థులు, వ్యాపార సంస్థలతో పాటు పక్క జిల్లాల నుంచి ప్రజలు, ప్రయాణికుల రాకపోకలతో నిత్యం ప్రజలతో రద్దీగా ఉండే ఎంఎస్‌కే రహదారి డివైడర్‌పై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదాలకు నెలవు

డివైడర్‌పై సెంట్రల్ లైటింగ్ లేకపోవడంతో రాత్రి వేళల్లో డివైడర్ పక్కనే పశువులు తిష్ట వేసుకొని ఉండటంతో పాటు డివైడర్‌పై నుంచి కుక్కలు ఒక్కసారిగా రహదారిపైకి రావటంతో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. డివైడర్ కనిపించక లారీలు, చిన్నకారులు డివైడర్ పైకి దూసుకు వెళ్లి ప్రమాదాల బారిన పడిన ఘటనలు గతంలో ఎన్నో చోటుచేసుకున్నాయి.

ఆక్రమణకు గురవుతున్న రహదారులు

రహదారి పక్కన ఆక్రమణలు తొలగించాలని ఎన్నో సార్లు పంచాయతీ ఆధ్వర్యంలో మైక్ ద్వారా ప్రచారం చేసినా పూర్తిగా జరగలేదు. రహదారి మార్జిన్లు ఆక్రమణకు గురికావడంతో రద్దీగా ఉండే సమయంలోప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

ఆక్రమణలు తొలగించాలి

విస్సన్నపేటలో ఎంఎస్‌కే రహదారి డివైడర్‌పై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసి విస్సన్నపేట పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దాలి. ప్రమాదాల నివారణకు రహదారి మార్జినలో ఆక్రమణలు తొలగించాలి. పశువులు తిష్ట వేయకుండా చర్యలు తీసుకోవాలి.

–వి నాగరాజు, సీపీఎం మండల కార్యదర్శి, విస్సన్నపేట

ప్రత్యేక నిధులు అవసరం

గ్రామ పంచాయతీ నుండి డివైడర్‌పై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు ఎటువంటి ప్రతి పాదనలు పెట్టలేదు. ప్రత్యేక నిధులతో ఇటువంటి పనులు చేపట్టాల్సి ఉంటుంది. పశువులు రహదారిపై తిష్ట వేయకుండా గోశాలకు తరలిస్తున్నాం.

– హరికృష్ణకుమార్, పంచాయతీ ఈఓ, విస్సన్నపేట

గొప్ప దార్శనికుడు అంబేడ్కర్

వర్ధంతి కార్యక్రమాల్లో వక్తల నివాళి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గొప్ప దార్శనికుడని పలువురు వక్తలు పేర్కొన్నారు. అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాలు మైలవరం, తిరువూరు, నూజివీడు నియోజకవర్గాల్లో శుక్రవారం నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో వక్తలు మాట్లాడుతూ అంబేడ్కర్ సేవలను కొనియాడారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పేర్కొన్నారు. కొండపల్లిలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మిక్కిలి శరభయ్య అధ్యక్షతన పార్టీ నాయకులు బీ కాలనీ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పళ్ళిగోళ్ల పండు, బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల రాజేష్, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి కాకి జోజి, సీనియర్ నాయకులు ఎంఏ బేగ్, పోరంకి శ్రీనివాసరాజు, నల్లమోతు ప్రకాష్, దయాకర్, వసంతరావు తదితరులు పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నం శక్తినగర్‌లో జర్నలిస్టుల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి శ్రద్ధాంజలి ఘటించారు. సీఐటీయూ, ఐద్వా, తోపుడు బండ్ల యూనియన్ నాయకులు మహేష్, విఠల్‌రావు నివాళులర్పించారు. ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి మందా నాగమల్లేశ్వరరావు పుష్పాంజలి ఘటించారు. డీసీసీ అధ్యక్షుడు బొర్రా కిరణ్ నివాళులర్పించారు. పీసీసీ కార్యదర్శి పోతురాజు ఏసుదాసు పాల్గొన్నారు.

గ్రామ గ్రామాన వర్ధంతి కార్యక్రమాలు..

మైలవరం: జి.కొండూరు మండల పరిషత్ కార్యాలయంలో డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీపీ వేములకొండ లక్ష్మీ తిరుపతమ్మ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈఓపీఆర్‌డీ కె. శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు. మైలవరం ఎంపీడీఓ కార్యాలయం కూడలి, నూజివీడు రోడ్డులోని డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాలకు వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్. తిరుపతిరావు, మండల అధ్యక్షుడు వెంకట్రావు, చామల సీతారెడ్డి, పాలా నారాయణరెడ్డి, నిరీక్షణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు అంబేడ్కర్

ఇబ్రహీంపట్నం: రాజ్యాంగంతో అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిరస్మరణీయులని ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ టి.నాగరాజు అన్నారు. ఏపీఎస్ఈబీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

- **మైలవరం:** రెడ్డిగూడెంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. వైస్ ఎంపీపీ రాబర్ట్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలు, బీసీలు అణగారిన వర్గాల అభ్యున్నతికి



కొండపల్లి బీకాలనీలో నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అంబేడ్కర్ చేసిన సేవలను కొనియాడారు. సర్పంచ్ మల్లాది రాణి, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు చాట్ల ఆదియ్య, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు గుడిసే ప్రభాకరరెడ్డి, పైడిమర్ల శ్రీనివాస్‌రెడ్డి, చాట్ల ఇమ్మానియేలు, చాట్ల రత్తయ్య, షేక్ గాలి షాహిద్, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి

చాట్రాయి: మండలంలోని జనార్దనవరం గ్రామంలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

- **తిరువూరు:** వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బోసుబొమ్మ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వార్డు కౌన్సిలర్లు శ్రీనివాసరావు, తంగిరాల వెంకటరెడ్డి, మోదుగు ప్రసాద్, చిన్నారి, దుర్గారావు, శేఖర్, సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ అంబేడ్కర్ సేవలను కొనియాడారు. వైఎస్సార్ సీపీ నాయకులు గత్తం నాగేశ్వరరావు, నవీన్, చలమాల సత్యనారాయణ, కుటుంబరావు, మోహనరెడ్డి, జాకీర్, ఆదినారాయణ, సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.
- **విస్సన్నపేట:** అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు ముంగా జయరాజు అన్నారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైస్ ఎంపీపీ రెడ్డి శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ ఓలేటి దుర్గారావు, ఎంపీటీసీ సభ్యుడు జి. మల్లయ్య, కో–ఆప్షన్ సభ్యుడు షేక్ జాఫర్‌బాబా, దస్తగిరి, పల్లెపాం లక్ష్మయ్య, నాయకులు పాల్గొన్నారు. బహుజన దళిత ఐక్య వేదిక ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. సభ్యులు ఎం. శ్రీనివాసరావు, గొర్రె లాజరస్, మేకల జ్ఞానరత్నం, వి. నాగరాజు, కొండా రాజ్‌కుమార్, డాక్టర్ విజయ్, సాధుపాటి కోటేశ్వరరావు, ధనరాజు, సూరిరాజు, రామారావు పాల్గొన్నారు.
- **ఆగిరిపల్లి:** రాజవరంలో సర్పంచ్ జాల భూషణం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జంగా కోటేశ్వరరావు, రొంపిచర్ల గిరిధర్, ఆర్. సుబ్బారావు, గ్రామస్తులు పాల్గొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు దళిత సంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు నివాళులర్పించారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

నూజివీడు: అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు అన్నారు. అంబేడ్కర్ వర్ధంతిని స్థానిక వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కృష్ణంరాజు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, పలువురు నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, కౌన్సిలర్ కొడవటి రాంబాబు, మాజీ కౌన్సిలర్ కంచర్ల లవకుమార్, నాయకులు కాలి సుగుణరావు, సతీష్, చేబత్తిన మున్నా, షేక్ మస్తాన్, రాజు పాల్గొన్నారు.



నూజివీడులో నివాళులర్పిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, నాయకులు



మైలవరంలో నివాళులరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



విస్సన్నపేటలో నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



విస్సన్నపేటలో నివాళులర్పిస్తున్న బహుజన దళిత ఐక్య వేదిక నాయకులు



రాజవరంలో నివాళులర్పిస్తున్న సర్పంచ్, తదితరులు



జనార్దనవరంలో నివాళులర్పిస్తున్న నాయకులు



తిరువూరులో నివాళులర్పిస్తున్న నాయకులు



ఇబ్రహీంపట్నంలో నివాళులర్పిస్తున్న నాయకులు

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

జిల్లా జాయింట్ కలెక్టర్ నిధి మీనా

మైలవరం: గ్రామాల్లో సమస్యలు పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ నిధి మీనా అన్నారు. మైలవరం మండలం మొరుసుమల్లి గ్రామంలో శుక్రవారం గ్రామ రెవెన్యూ సదస్సు సర్పంచ్ మాడపాటి రమాదేవి అధ్యక్షతన జరిగింది. నిధి మీనా మాట్లాడుతూ గ్రామస్తులు రెవెన్యూ సమస్యలకు సంబంధించిన అర్జీలను రెవెన్యూ అధికారులకు సమర్పించాల్సిందిగా సూచించారు. అప్పటికప్పుడు పరిష్కరింపదగిన సమస్యలను సమావేశంలోనే పరిష్కరిస్తామని చెప్పారు. రైతుల నుంచి 50 అర్జీలను అధికారులు స్వీకరించారు. సమావేశంలో తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సభలు

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): రైతుల భూ సమస్యలు పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని మండల ప్రత్యేకాధికారి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ టి.సత్యనారాయణ అన్నారు. గుంటుపల్లిలో సర్పంచి భుక్యా కవిత అధ్యక్షతన గ్రామ రెవెన్యూ సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని కోరారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. భూ వివాదాలు, సమస్యలపై 13 అర్జీలను స్వీకరించారు. తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు, ఈఓపీర్డీ మనోజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి జి.మునేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

- **తిరువూరు:** భూ సంబంధిత సమస్యల పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారుల బృందం గ్రామాల్లో సందర్శిస్తారని ఆర్డీఓ కె. మాధురి అన్నారు. ఎ. కొండూరులో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆర్డీఓ మాట్లాడుతూ రైతులు తమ భూ సమస్యలపై అధికారులకు అర్జీలు సమర్పించి పరిష్కరించుకోవాలని సూచించారు. అధికారులు నిర్దేశించిన సమయంలోగా విచారణ జరిపి పరిష్కరిస్తారని చెప్పారు. పలువురు అధికారులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.
- **కొండపర్వ(విస్సన్నపేట):** కొండపర్వ గ్రామ సచివాలయంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో 14 అర్జీలు రైతుల నుంచి అందాయని తహసీల్దార్ కె. లక్ష్మీకల్యాణి తెలిపారు. మ్యూటేషన్‌కు సంబంధించి 6, బౌండ్రీ సర్వేకి సంబంధించి 8 అర్జీలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి చక్రాణి, సర్పంచ్ జి. రమేష్‌బాబు పాల్గొన్నారు.



మొర్సుమల్లి సదస్సులో రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న నిధి మీనా



ఎ.కొండూరు రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీఓ మాధురి

వెలవెలబోయిన గ్రామ రెవెన్యూ సదస్సులు

అధికారులకు ఖాళీ కుర్చీలు దర్శనం

మైలవరం: మైలవరం నియోజకవర్గంలో నిర్వహిస్తున్న గ్రామ రెవెన్యూ సదస్సులు వెలవెల పోతున్నాయి. సమస్యలు పరిష్కరించలేని అధికారులతో మనకేంటి పని అన్న చందంగా రైతులు సదస్సుల్లో పాల్గొనేందుకు ఉత్సాహం చూపడంలేదు. మైలవరం మండలం మొర్సుమల్లి గ్రామం, జి.కొండూరు మండలం కవులూరు గ్రామం, రెడ్డిగూడెం గ్రామంలో శుక్రవారం రెవెన్యూ గ్రామ సదస్సులు జరిగాయి. కవులూరులో జరిగిన గ్రామ సభకు రైతులు రాకపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సభల నిర్వహణపై ఎలాంటి ప్రచారం లేదని విమర్శించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో జరిగిన సదస్సుల్లో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి.



కవులూరు సదస్సులో దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు

తేమ శాతం అధికంగా ఉన్నా కొనుగోలు చేయాలి

సివిల్ సప్లయీస్ జిల్లా మేనేజర్ సతీష్

మైలవరం: తేమ శాతం అధికంగా ఉన్నా రైతుల నుంచి వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని సివిల్ సప్లయీస్ జిల్లా మేనేజర్ సతీష్ డీసీఎస్, పీఏసీఎస్ సిబ్బందికి సూచించారు. మైలవరం మార్కెట్ యార్డు, పొందుగల గ్రామాలలోని ఆర్ఎస్‌కేలలో జిల్లా వనరుల కేంద్రం, విజయవాడ వారి ఆధ్వర్యంలో రైతులకు శిక్షణా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. మార్కెట్ యార్డులో రైతులు ఆరబోసుకున్న ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు ఇబ్బందులు పడకుండా సివిల్ సప్లయీస్ శాఖ నుంచి పట్టాలు కొత్తగా అందుబాటులోకి వచ్చాయన్నారు. ఇప్పటివరకు మైలవరం మండలంలో 325 టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని చెప్పారు. డీడీఏ మాధవీలత మాట్లాడుతూ రైతులు రానున్న సీజన్‌కు విత్తనాన్ని సొంతంగా తయారు చేసుకోవాలన్నారు. చిరు పొట్ట దశలో పొటాష్ ఎరువు వేసుకోవడం వలన గింజ నాణ్యత , రంగు పెరుగుతుందని చెప్పారు. సొంతంగా విత్తనం తయారు చేసుకోవడం వలన కేళీలు రాకుండా నివారించుకోవచ్చన్నారు. వరి, మొక్కజొన్న పొలాల పరిశీలించారు. ఏడీఏ మోనీషా, ఏడీఏ(ఆర్) ఎం. శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారిణి కె. సంధ్యారాణి, వీఏఏలు పాల్గొన్నారు.

ఇదేమి పద్ధతి

- మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కించపరిచేలా వ్యాఖ్యలు
- ఏబీ వెంకటేశ్వరరావు చేసిన విమర్శలతో ఫ్లెక్సీలు ఏర్పాటు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఉద్దేశించి గతంలో రిటైర్డ్ పోలీస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు చేసిన వ్యాఖ్యలతో నూజివీడులో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ కలకలం రేపింది. ఆయన సొంత నియోజకవర్గమైన నూజివీడులో ఆయన అనుచరులుగా ఉన్న టీడీపీ నేతల ఫొటోలతో పరోక్ష విమర్శలు చేస్తూ ప్రధాన సెంటర్‌లో ఈ ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మాట సరి చేసుకో... భాష సరి చేసుకో...అంటూ ఏర్పాటు చేసిన ఈ ఫ్లెక్సీలోని భాషను చూసి ప్రజలు ఇదేమి సంస్కారం.. ఇదేమి భాష.. అంటూ చర్చించుకోవడం గమనార్హం.

నేడు సుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణోత్సవం

ముసునూరు: శ్రీవల్లీ దేవసేన సమేత, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి తిరు కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నామని ప్రధానార్చకులు చిట్టిబాబు శుక్రవారం తెలిపారు. సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా శనివారం గోపవరం శివారు నాగేంద్రపురంలోని ప్రసిద్ధ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం వద్ద కల్యాణ మహోత్సవం జరుగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 2,000 మంది భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశామని చెప్పారు.

ఆటో వర్కర్లకు బ్యాంక్ రుణ సదుపాయం కల్పించాలి

ఇబ్రహీంపట్నం: మైలవరం ఆటో వర్కర్స్ యూనియన్ సర్వ సభ్య సమావేశం ఇబ్రహీంపట్నంలోని వెలగా లక్ష్మణరావు భవన్‌లో యూనియన్ అధ్యక్షుడు నాగరాజు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. సీఐటీయూ మండల కార్యదర్శి ఎం. మహేష్ మాట్లాడుతూ ఇంటర్, డిగ్రీలు చదివి సరైన ఉద్యోగాలు లేక ఎంతోమంది ఆటో డ్రైవర్లుగా జీవనం సాగిస్తున్నారని చెప్పారు. కిరాయిలు లేక, ఈఎంఐలు కట్టలేక ఆటో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆటో కార్మికులకు బ్యాంక్ రుణ సదుపాయం కల్పించాలని కోరారు.

బెల్టుషాపుపై ఎక్సైజ్ పోలీసుల దాడి

వీరులపాడు: మద్యం బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ అఫ్రపున్నిసా బేగం హెచ్చరించారు. మండలంలోని నరసింహారావుపాలెం గ్రామంలో బెల్టుషాపు నిర్వహిస్తున్నారనే సమాచారంతో శుక్రవారం ఆమె తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన లంకోజి అరుణ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి ఏడు మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు.

రావమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

ఆగిరిపల్లి: దుగ్గిరాల బాల రావమ్మ తల్లికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురు స్వామి శ్రీమన్నారాయణ స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, కుంకుమార్చన, అమ్మవారికి ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప, భవాని మాలదారులు, భక్తులు పాల్గొన్నారు.